# అగాధం

అస్తమిస్తున్న సూర్యకిరణాల వెలుగులో, అస్తమించబోతున్న వేరుశనగ పైరును చూస్తూ నిర్లిప్తంగా నిట్టూర్చినాడు రామప్ప. మొవ్వకుళ్లు తెగులతో నల్లబడి, గిడసబారిన వేరుశనక్కాయాలను చూస్తుంటే, అతని కడుపులో దేవినట్లయింది. ఇరవై ఎకరాల్లో వేసిన ఆరుబస్తాల విత్తనాలూ, మందుల ఖర్చులూ, కూలీనాలీ ఖర్చులూ, చేసిన అప్పులూ కళ్ళముందు మెదలుతూంటే అతని శరీరంలో చిన్న వణుకు లాంటిది ప్రారంభమైంది. ఎన్నాళ్లుగానో కూడగట్టుకున్న ధైర్యమంతా ఒక్కసారిగా క్రుంగిపోయినట్లు భారంగా నిట్టూర్చినాడు.

ఇది వరుసగా నాలుగో ఏడు-వేరుశనగ పంట చేతికి చిక్కక! మూడేళ్ళ కిందట ఎర్రగొంగళి కాటుకు పైరంతా కాల్చినట్టు నల్లగా కాలిపోయి పెట్టుబడి కాదు కదా, కూలివాళ్ళకు యిచ్చిన కూలి మొత్తం కూడా వెనక్కు రాలేదు. రెండేళ్ళ కింద, తీరా పంట చేతికొచ్చే సమయంలో, 15 రోజులపాటు జడిపట్టుకొని, నీరుకాయపడి, నాసిరకం విత్తనంతో ఔటన్‌రాక సగం పంట కూడా చేతికి చిక్కలేదు. నిరుడు సరేసరి - విత్తనం వేయటమే ఆలస్యం - ఆ తర్వాత వచ్చిన దొంగ వానలన్నీ రైతుని మోసం చేసి నెత్తిన గుడ్డ వేసుకొనేలా చేసినాయి. ఇప్పుడు చూస్తే ఇదేదో కొత్త రోగమట- మొవ్వకుళ్ల తెగులట దీనిపేరు. ఆదేదో మనుషులకొచ్చే ఎయిడ్స్‌లాంటి వ్యాధి అని కొడుకు చెపితే అప్పుడర్థమయింది ఈసారీ ఇంతే అని!

రామప్ప చేన్లో నుంచి బయటపడి ఊరివేపు నడక సాగిస్తున్నాడు. అతడు కాళ్లను భూమి బలంగా అదిమిపట్టుకున్నట్టు, అడుగుతీసి అడుగు నెమ్మదిగా వేస్తున్నాడు. అతని ఆలోచనలు కదిలించిన కందిరిగే తుట్టెలాగా అతన్ని కమ్ముకొని కాటువేస్తున్నాయి. తాను ఎక్కడికక్కడ, ఈ మూడేళ్ళ కాలంలో చేసిన అప్పులన్నీ ఆగి ఆగి గుణించుకుంటున్నాడతను! బ్యాంక్‌లో చేసిన అప్పుల సంగతి అలా పక్కకు



★ కథ నిలయం ★ శ్రీకాకుళం

పెట్టినా, రెండునుండి నాల్గు రూపాయల వడ్డీతో తెచ్చిన రకరకాల అప్పులన్నీ అతని కంఠాన్ని నలుపుతుండగా గిజగిజలాడుతూ వంకర్లు పోతున్నాడు రామప్ప-

చేసిన అప్పులన్నీ విత్తనాలకూ, ఎరువులకూ, మందులకే కలిపి అవుకు నాగయ్య దగ్గర తెచ్చిన మొత్తం నలభైవేలే అయినా, వడ్డీలు కలిపి కలిపి, తిరిగి తిరిగి, రాయగా రాయగా ఇప్పటికీ ఈ మూడేళ్ళలో ఎనభై దాటింది. సత్రాల రామలింగయ్య వంద, రెండు వందలూ, ఇలా చేబదుళ్ళు ఇచ్చి ఇచ్చి పదివేలకు పత్రం రాయించుకుని రెండేళ్ళు దాటింది. సుబ్రహ్మణ్యంకు పదెకరాల ఎర్ర గురుగుశేను ఆయకం పెట్టి తెచ్చుకొన్న ఇరవైవేలూ, ఇప్పుడెంతయిందో తలచుకోవడానికి భయంగా ఉంది. ఇవిగాక టౌన్లో బట్టల షాపులో, కిరాణా అంగళ్ళలో, ఎరువుల అంగళ్ళలో చేసిన బాకీలు నోటిలెక్కలతో చెప్పటానికి వీల్లేనివి- వీటిలో సగ భాగం కూడా ఇంట్లో తెలీవు. దాదాపు అరవై శాతంపైగా ఇప్పటికే నాశనమైపోయిన పైరు, ఏ అవసరాలను, ఏ అప్పుల్ని తీర్చగలుగుతుంది? నన్ను తీర్చటం తప్ప అని, బయటికి బిగ్గరగా అనేసినాడు రామప్ప.

"ఏంది బావా! గట్టిగా మాట్లాడుకుంటా వుండావు పిచ్చోడిలాగా" అని వెనకాల వస్తున్న రామక్రిష్ణప్ప హెచ్చరిస్తే, ఆగి వెనక్కు చూసినాడు రామప్ప. తన పక్కకు వచ్చి నిలబడ్డ రామక్రిష్ణప్ప వైపు కేవలం వెర్రి చూపులు చూస్తూండిపోయినాడు రామప్ప.

"మోనోక్రోటోఫాస్ మండలంలో ఇస్తుండారంట. మీ వాడిని పంపించినావా" అని అడిగినాడు రామక్రిష్ణప్ప. రామప్ప ఈ లోకంలోకి వచ్చిన వాడిలాగా తల విదిలించుకొని "మొన్నా పొయ్యినాడు, నిన్నా పొయ్యినాడు. ఈ పొద్దూ పొయ్యినాడు. పంటంతా పాడైపోయినంక ఎవుడికి కావల్లంట ఆ పాడుమందు - వద్దురా అని చెప్పినా వినకుండా 'ఇప్పటికి కాకపోయినా, మడికన్నా పనికొస్తుంది గదా అని వెళ్ళినాడు వాడు' అని వివరణ ఇచ్చుకుంటున్నట్లు చెప్పినాడు రామప్ప.

"మొత్తానికి గవర్నమెంటుకు బుద్ధి లేదు బావా! ఈ తెగులుకు మందుకొట్టి లాభం లేదని సైంటిస్టులెవరో చెప్పినా యాల ఇవ్వల్ల - రైతులందర్నీ మండలాల చూట్టూ యాల తిప్పుకోవల్ల - దానికి బదులు పనికొచ్చే విత్తనాలేవన్నా సరఫరా చేస్తే గదా" అని పాఠంలా ప్రారంభించాడు రామకృష్ణప్ప.

ఈ రామకృష్ణప్పకు ప్రపంచమంతా తెలుసు. ఏం చేస్తాం పాపం- చదువూ సంధ్యా వుండి ఉద్యోగం సద్యోగం లేక ఉన్నవూర్లో నాలుగెకరాలను మెడకు కట్టుకొని బక్క ఎద్దులా బతుకు ఈడుస్తున్నాడు అనుకొని చింతించినాడు రామప్ప. పాపం అని పెదాలు చప్పరిస్తూ-

"గవర్నమెంటునని కూడా లాభం లేదు బావా! మొదట కలెక్టర్ కూడా, ఈ దశలో మందు పనికి రాదని అన్ని రాజకీయ పార్టీలనీ ఒప్పించినాడు. తీరా

మరుసటిరోజే ప్రతిపక్ష రాజకీయ పార్టీలన్నీ మందు పంపిణీ చేయాల్సిందే అని గట్టి పట్టుపట్టి ఒప్పించినాయి. ఈ పార్టీలన్నీ తామంతా రైతుల పక్కన వుండామని నిరూపించుకొనేందుకు చేసిన పని ఇదంతా – రైతులందరికీ ఆశపెట్టి, మండలం చుట్టూ తిప్పించుకొనేలా చేసినారు వీళ్లంతా, పనికొచ్చేది కాదు; పారేసేదీకాదు ఈ మందు. మన వాళ్ళు చేసే నిర్వాకం ఇట్లా ఉంటుంది బావా"! అంటూ చెపుతూనే వున్నాడు రామకృష్ణప్ప.

"అయితే ఈ పొద్దన్నా ఆ మందు ఇచ్చి ఉంటారంటావా క్రిష్ణప్పా!" అనడిగాడు అత్రంగా రామప్ప.

"ఇంకా ఈకపోతే గూబ పగలగొడతారు- పదపద చీకటిపడింది" అంటూ గబగబా నడిచాడు రామకృష్ణప్ప.

ఇంటికి రామప్ప చేరేసరికి బాగా చీకటిపడిపోయింది. పెద్దకొడుకు నాగరాజు వాకిట్లోనే ఎదురైతే "ఈ పొద్దన్నా మందు ఇచ్చినారా" అని అడిగాడు.

"నిన్నంతా సాయంత్రం దంకా రాస్తారోకో చేసినాము కదా – ఆ దెబ్బకు కలెక్టర్, ఎస్పీ, ఆర్.డి.ఒ. అంతా దిగబడినారు. తెల్లారేసరికల్లా మందు స్టాకు దింపినారు" అన్నాడు విజయోత్సాహం లాంటిది మొహంలో తొణికిస లాడుతుండగా!

"మనకెంత ఇచ్చినారు" ఆదుర్దాగా అడిగాడు తండ్రి. "రెండు లీటర్లు ఇచ్చినారు. అయినా ఇప్పుడు మనకేం పనికొస్తుంది" అన్నాడు కొడుకు. "ఇంతకూ ఇంటికన్నా తెచ్చినావా లేదా" అనడిగాడు రామప్ప జీరగొంతుతో. "తెచ్చినా కానీ రేపు పాలకొండ సుబ్బరాయుడికివ్వల్ల- నన్నూరు ఇప్పించుకుండా; చీనాతోటకు కొట్టుకుంటాడట" అంటూ బయటకెళ్లినాడు నాగరాజు.

ఆ రాత్రి పదకొండు దాటినా నిద్రపట్టలేదు రామప్పకు. బావిలో నీళ్లు లేకపోతే బోర్ వేయించి సబ్‌మెర్సిబుల్ ఫిటప్పు చేయించిన ఆర్నెల్లకే బోర్ ఎండిపోయి ఆ అప్పు ఇంకా నెత్తిమీద కత్తిలా ఒకవైపు వేలాడుతూనే ఉంది. అదికాకనే రకరకాల అప్పులు లక్షన్నర దాటినాయి. ఈ పంటలిక పండవు – ఈ అప్పు ఇక తీరదు– ఈ భూముల్ని అమ్మినా ఎవ్వరూ కొనరు.

ఇలా చింతలు చేసి చేసి, అర్ధరాత్రి కావస్తుండగా మంచం దిగినాడు రామప్ప. మెల్లగా అడుగులు వేసుకుంటూ బయటకు వచ్చి పక్కనే వున్న పసుల కొట్టంలోకి నడిచినాడు. పసలు గాటిమీద నిలబడి అట్టవ మీద అటూ ఇటూ చూసినాడు. మామూలుగా పురుగుల మందులు పెట్టే గూట్లోనే తళతళ తెల్లగా మెరుస్తూ కన్పించినాయి మోనోక్రోటోఫాస్‌లు. ముందుకు వంగి, ఒకదాన్ని తీసుకొని గట్టిగా చేతుల్లో పట్టుకొని కిందికి దిగినాడు రామప్ప.

• *కదలిక – అక్టోబర్, 2000* •